క్లుప్తంగా

వేగేశ్వరపురం జేబీ స్కూల్ హెచ్ఎం మృతి


సాయి చంద్ర (ఫైల్)

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురం మండల పరిషత్ జూనియర్ బేసిక్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్న టి.సాయిచంద్ర (50) శనివారం గుండెపోటులో మృతి చెందారు. సంక్రాంతి సందర్భంగా భర్త స్వగ్రామం నర్సీపట్నం వెళ్లారు. గత కొంత కాలంగా హృద్రోగ సమస్యతో బాధపడుతున్న సాయిచంద్ర ఆకస్మాత్తుగా మృతి చెందారు. మండలంలోని పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆమె మృతికి సంతాపం వ్యక్తం చేశారు. అలాగే ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి.దుర్గారావు, మండల అధ్యక్షుడు పి.రఘువార్ శాస్త్రి, యూటీఎఫ్ నాయకులు బి.విజయబాబు, బి.శంకర్, శంకరం, రాజు, పద్మశ్రీ మణి, రాజరత్నం తదితరులు సంతాపం తెలిపారు.

20 నుంచి పశు ఆరోగ్య శిబిరాలు

చాగల్లు: పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని గ్రామాల్లో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్టు పశువైద్యాధికారి ముఖేష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20 నుంచి 31 వరకు ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి ఆయా గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తారన్నారు. పశువులు, దూడలు, గొర్రెలు, మేకలు, కోళ్లకు నట్టల నివారణ మందులు, వివిధ రకాల వ్యాధి నివారణ టీకాలు వేస్తారన్నారు. పశువులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తారన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ నెల 20న నెలటూరు, 21న చంద్రవరం, గౌరిపల్లి గ్రామాలు, 22న నందిగంపాడు, 23న మార్కొండపాడు, 24న ఊనగట్ల, 25న ఎస్.ముప్పవరం, 27న బ్రాహ్మణగూడెంలో, 28న ధారవరం, 29న మల్లవరం, 30న చిక్కాల గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్టు వివరించారు.

యువజన సేవా సంఘం అధ్యక్షుడిగా రాజారత్నం

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెంలోని అరుంధతీపేట బాబూ యువజన సేవా సంఘం అధ్యక్షుడిగా ముప్పిడి రాజారత్నం, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా గెడ్డం రవీంద్రబాబు, ప్రధాన కార్యదర్శిగా కొల్లి శ్రీను, కోశాధికారిగా సిర్రా కోట వెంకటకుమార్‌తో పాటు మరో 13 మంది సభ్యులతో కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈనెల 19న భారత మాజీ ప్రధాన బాబూ జగ్జీవన్‌రామ్ 9 అడుగుల నూతన విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపనతో పాటు కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన జిమ్, గ్రంథాలయాన్ని ప్రారంభిస్తామని రాజారత్నం తెలిపారు.

ఘనంగా అన్నసమారాధన

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెంలో వేంచేసిన సోమాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద శనివారం భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి సోమాలమ్మను దర్శించుకుని కుంకుమ పూజలు జరిపారు. ఆలయ కమిటీ అధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

ఉండ్రాజవరం: జాతర మహోత్సవాల్లో భాగంగా మండలంలోని కె.సావరం గ్రామంలో ముత్యాలమ్మ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని రంగవల్లులు తీర్చిదిద్దారు. ఈ ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలు పసుపులేటి మౌనిక (ప్రథమ) గ్రాము బంగారం, మీసాల అంజలి (ద్వితీయ) ఆరు తులాల వెండి పట్టీలు, వి.హిరణ్యశ్రీ (తృతీయ) మిక్సీ, తూము నాగలక్ష్మి (నాలుగు) గ్రైండర్, కమ్మరి ప్రియంక (ఐదు) సీలింగ్ ఫ్యాన్, ఎస్.తేజశ్రీ (ఆరు) నాన్ స్టిక్ కుక్‌వేర్, ఈలి భాగ్యలక్ష్మి (ఏడు) హాట్ బాక్స్‌లను శ్రీముత్యాలమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సభ్యులు అందించారు.

సమాజానికి వేమన పద్యాలు చాలా అవసరం


వేమన విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న తోరాటి వసంతరావు తదితరులు

కడియం: వేమన శతక పద్యాలు నేటి సమాజానికి చాలా అవసరమని ప్రముఖ విద్యావేత్త తోరాటి వసంతరావు అన్నారు. చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి కళాసేవా సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడపా సుబ్రహ్మణ్యం, చిలుకూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం వేమన జయంత్యుత్సవం నిర్వహించారు. వేమగిరి బుద్ధ విహార్ అధ్యక్షుడు యార్లగడ్డ మైత్రేయి నెలకొల్పిన భారీ వేమన విగ్రహానికి పూలమాలలు వేసి, పూలు సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సమితి గౌరవ అధ్యక్షుడు తోరాటి మాట్లాడుతూ నేటి సమాజంలో నూతన తరానికి వేమన పద్యాలు ఎంతో అవసరమన్నారు. అనంతరం వేమన శతక పద్యాల పుస్తకాలను పలువురికి బహూకరించారు.

స్వచ్ఛమేవ జయతే..

- గ్రామాల్లో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ ప్రారంభం
- పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన
- స్వచ్ఛ భారత్‌పై ప్రతిజ్ఞ చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు


కొవ్వూరు బస్టాండ్ సెంటర్‌లో అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు


దేవరపల్లిలో పంచాయతీ కార్మికుల ప్రదర్శన


పాలంగిలో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్‌లో భాగంగా ప్రతిజ్ఞ చేస్తున్న సందీప్, మండల అధికారులు


పెరవలిలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ అధికారులు

కొవ్వూరు/చాగల్లు: ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సూచించారు. కొవ్వూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్, చాగల్లులో శనివారం నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ్ దివస్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి నెలలో మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. కొవ్వూరు ఆర్టీసీ డిపో పరిసరాలను పారిశుధ్య కార్మికులు శుభ్రం చేశారు. పారిశుధ్య పరిరక్షణను బాధ్యతగా తీసుకుంటామని అధికారులు, పారిశుధ్య సిబ్బందితో ఎమ్మెల్యే ప్రతిజ్ఞ చేయించారు. పారిశుధ్య కార్మికులను ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ మునిసిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, మునిసిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్, మేనేజర్ పి.సాయిబాబా, చాగల్లు ఎంపీడీఓ ఆర్.శ్రీదేవి, విస్తరణ అధికారి ఆర్.శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు

దేవరపల్లి: స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం దేవరపల్లిలో పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. ఊర చెరువు గట్టుపై గల చెత్తను తొలగించడంతో పాటు డంపింగ్ యార్డును శుభ్రం చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ఎస్.రవి కిషోర్ మాట్లాడుతూ ప్రతి నెలా మూడో శనివారం గ్రామంలో ఈ కార్యక్రమం నిర్వహించి పారిశుధ్య పనులు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

గ్రామాలను స్వచ్ఛతగా తీర్చిదిద్దాలి

ఉండ్రాజవరం: ప్రతి పౌరుడు బాధ్యత కలిగి ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని గ్రామాలను స్వచ్ఛత గ్రామాలుగా తీర్చిదిద్దాలని మండల ప్రత్యేక అధికారి సందీప్ అన్నారు. మండలంలో పాలంగి గ్రామంలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో వి.రామారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పారిశుధ్యం పాటించి, పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని, ఆరోగ్యంగా జీవించాలన్నారు. ఈ కార్యక్రమం మూడో శనివారం అన్ని గ్రామ పంచాయతీల్లో ఒక సంకల్ప దీక్షగా జరిగేలా ప్రణాళికలు రూపొందించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బొక్కా శ్రీనివాసు, ఈవోపీఆర్డీ ఆంజనేయ శర్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భవానీ, ఎంఆర్‌సీ కత్తుల ప్రకాష్, పీఆర్ ఏఈ ఏడుకొండలు, ఏపీవో సత్యనారాయణ, కార్యదర్శి హసన్‌జానీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిడదవోలులో..

నిడదవోలు: పరిశుభ్రతే ధ్యేయంగా ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. పట్టణంలో మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛత ప్రతిజ్ఞ, మానవహారం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు రోడ్లను శుభ్రం చేశారు. మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి, ఆర్టీసీ డీఎం కె.వెంకటేశ్వరరావు, ఆర్టీసీ, మున్సిపల్, మెప్మా, వార్డు సచివాలయ, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో..

నిడదవోలు: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో స్వచ్ఛ ఆంధ్రా-స్వచ్ఛ దివస్‌లో భాగంగా శనివారం ఆసుపత్రి పరిసరాలను శుభ్రపరిచారు. వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆరుగురు పారిశుధ్య సిబ్బందికి పీపీ కిట్లు, యాప్రాన్లు, మాస్కులు, చేతి గ్లౌజులు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ ఫయాజ్ అహ్మద్, ఫయాజ్ అన్సారీ, డాక్టర్ పీవీ సూర్యప్రసాద్, షేక్ అలీఅబ్బాస్, స్టాఫ్ నర్సులు తదితరులు పాల్గొన్నారు.

పెరవలిలో..

పెరవలి: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛ గ్రామాలు చేయాలనే సంకల్పంతో ప్రభుత్వాలు వేల కోట్లు ఖర్చు చేస్తున్నాయని వీటిని సద్వినియోగం చేసుకుని అధికారులు సమన్వయంతో పనిచేస్తే అనుకున్నది సాధిస్తామని ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ తెలిపారు. స్వచ్ఛ ఆంధ్రా- స్వచ్ఛ దివస్ కార్యక్రమం సందర్భంగా శనివారం వివిధ శాఖల అధికారులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలు స్వచ్ఛంగా ఉంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని, అందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. అప్పుడే అనుకున్నది సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ వెంకటరమణ, సీడీపీఓ డి.శ్రీలక్ష్మి, ఏపీఎం బి.రామకృష్ణ, హౌసింగ్ డీఈ విక్టర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


బస్టాండ్‌లో చీపుర్లతో శుభ్రం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ, మున్సిపల్ సిబ్బంది


చాగల్లులో స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ ర్యాలీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు, అధికారులు

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి అనురాధ


కొవ్వూరు కోర్టు హాలులో వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేస్తున్న జడ్జి అనురాధ

కొవ్వూరు: ద్విచక్ర వాహనదారులు వాహనాలు నడిపే సమయంలో కచ్చితంగా హెల్మెట్ ధరించాలని జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి ఎం.అనురాధ సూచించారు. రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ ఆదేశాల మేరకు మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని కోర్టు హాలులో శనివారం హెల్మెట్స్ ప్రాధాన్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెల్మెట్ లేని ప్రయాణం శిక్షార్హమన్నారు. హెల్మెట్ ధరించని వాహదారులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఐదుగురు ద్విచక్ర వాహనదారులకు న్యాయమూర్తి హెల్మెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జీవీఏ సరస్వతీ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.సాయి కృష్ణ, సెకండ్ అడిషనల్ అండ్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కె.నాగలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాగంటి చలపతి రావు, జనరల్ సెక్రటరీ టి.చిట్టిబాబు, అసిస్టెంట్ ఎంపీఐ వి.లక్ష్మి ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలను వివక్షత లేకుండా చూడాలి

కంబాలచెరువు: కారాగారంలోని ఖైదీలను కుల, మత, లింగ వివక్షత లేకుండా చూడాలని జిల్లా ప్రధాన జడ్జి గంధం సునీత అన్నారు. బోర్డు ఆఫ్ విజిటర్స్‌తో కలిసి రాజమహేంద్రవరం కేంద్ర కారాగారాన్ని శనివారం జడ్జి గంధం సునీత, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు సందర్శించారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు మోడల్ ప్రిజన్స్ మాన్యువల్, 2016లోని 29వ అధ్యాయం ప్రకారం జైలు అధికారులకు జారీ చేసిన అన్ని నియమాలు, నిబంధనలు, ఆదేశాల ప్రకారం కుల, మత, లింగ వివక్షత లేకుండా ఖైదీలను చూడటం, వాటి అమలుకు సంబంధించిన పరిశీలన చేశారు. ఖైదీల జీవన పరిస్థితులు, సాధారణ పరిశుభ్రత, పారిశుధ్యం, బ్యారక్స్‌లో వాష్ రూమ్‌లు, మురుగునీటి నిర్వహణ, భద్రత, ఆహార ప్రమాణాలు, వసతులను, సదుపాయాలను పరిశీలించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడుతూ న్యాయవాది లేని వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామన్నారు. ఖైదీలకు ఎలాంటి న్యాయ సమస్యలున్నా పారా లీగల్ వలంటీర్ల ద్వారా, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ద్వారా సంస్థకు తెలియజేయాలన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి


కొవ్వూరులో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు/చాగల్లు: టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు వర్ధంతిని శనివారం కొవ్వూరు పట్టణం, చాగల్లులో నిర్వహించారు. కొవ్వూరు బస్టాండ్ సెంటర్, విజయ విహార్ సెంటర్లతో పాటు చాగల్లులో ఎన్టీఆర్ విగ్రహాలకు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇచ్చి గౌరవించాలని కోరారు. అనంతరం ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. వాత్సల్య వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యుడు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ, మాజీ మునిసిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, అర్బన్ బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కొవ్వూరు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం మాజీ మంత్రి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ ఆధ్వర్యంలో ఎన్టీ రామారావు విగ్రహానికి నివాళులర్పించారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

తాళ్లపూడి: మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా అన్నదేవరపేటలో వృద్ధులకు టీడీపీ నేతలు దుప్పట్లు పంపిణీ చేశారు.

ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పాంజలి

దేవరపల్లి: మండలంలో పార్టీలో రెండు వర్గాలు కొనసాగుతున్నందున రెండు వర్గాల నాయకులు వేర్వేరుగా ఈ కార్యక్రమం జరిపారు. దేవరపల్లి బస్టాండ్ వద్ద గల ఎన్టీఆర్ విగ్రహానికి ఉదయం 8 గంటల సమయంలో గన్నమని హరికృష్ణ ఆధ్వర్యంలో పలువురు కార్యకర్తలు నివాళులు అర్పించారు. కొద్ది సేపటికి మరొక వర్గం నాయకుడు సుంకర దుర్గారావు ఆధ్వర్యంలో పలువురు కార్యకర్తలు అక్కడ ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు.

సినిమాకెళితే షాకే..

- విపరీతంగా పెరిగిన టిక్కెట్ ధరలు
- తినుబండారాలదీ అదే పరిస్థితి
- థియేటర్‌కు వెళ్లాలంటే దడే


రాజమహేంద్రవరంలోని ఓ సినిమా థియేటర్

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సినిమా అనేది ఎంతో మందికి వినోదాన్ని పంచే ప్రధానం సాధనం. ఇంటిల్లిపాదీ థియేటర్‌కు వెళ్లి తమ అభిమాన నటుడి చిత్రాన్ని చూసి, ఇంటర్వెల్లో తమకు నచ్చిన తినుబండారాలు ఆరగించి ఎంతో మధురానుభూతిని పొందేవారు. అయితే ఇదంతా గతం. ప్రస్తుతం ఆకాశాన్నంటుతున్న టికెట్ రేట్లు, సామాన్యుడికి అందుబాటులో లేని స్నాక్స్ ధరలతో థియేటర్ వైపు వెళ్లాలంటేనే జంకుతున్నారు. తమ పిల్లలు మారం చేస్తుండటంతో కొందరు తప్పనిసరి పరిస్థితిలో సినిమాకు వెళుతున్నారు. గతంలో సినిమా టిక్కెట్లు, స్నాక్ ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండేవి. కుటుంబ సభ్యులతో కలిసి సినిమా చూసి రావడానికి టిక్కెట్లు, తినుబండారాలతో కలిసి రూ.600 నుంచి రూ.800 వరకు మాత్రమే అయ్యేవి. ఈ ఖర్చు ప్రజలకు పెద్ద భారంగా మారేది కాదు. అయితే ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది.

అప్పులు చేస్తూ..

సినిమాకు తీసుకువెళ్లాలని పిల్లలు కోరితే కాదనలేక, తమ స్తోమతకు మించి ఖర్చు చేయలేక ఇంటి పెద్దలు నలిగిపోతున్నారు. కొందరు అప్పులు చేసి మరీ తమ పిల్లల సంతోషాలను తీరుస్తున్నారు. మరికొందరు ముందూ వెనుకా చూడకుండా క్రెడిట్ కార్డుల్లో డబ్బులు ఖర్చు చేసి, నెలాఖరులో బిల్లు చెల్లింపు కోసం తిరిగి అప్పులు చేస్తున్నారు. దాదాపు 20 శాతం కుటుంబాల పరిస్థితి ఇలాగే ఉంటోంది.

అధిక ధరలతో జేబులకు చిల్లు

సంక్రాంతి సమయంలో అనేక సినిమాలు విడుదలవుతాయి. పండగ కోసం దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు తమ కుటుంబ సభ్యులతో కలిసి సినిమా చూడాలని కోరుకుంటారు. దీంతో థియేటర్లన్నీ ప్రేక్షకులతో కిటకిటలాడతాయి. ఈ నేపథ్యంలో భారీగా లాభాలు సాధించాలనే ఉద్దేశంతో ప్రభుత్వాలను ఒప్పించి టిక్కెట్ ధరలను నిర్మాతలు పెంచుకుంటున్నారు. థియేటర్ నిర్వాహకులు తినుబండారాలపై అధిక ధరలు వసూలు చేస్తూ ప్రేక్షకుల జేబులకు చిల్లు పెడుతున్నారు.

సామాన్యుడికి సినిమా దూరం



కొత్త సినిమాల విడుదల సమయంలో టిక్కెట్ల ధరలను విపరీతంగా పెంచడంతో సినిమాకు సామాన్యుడు దూరమవుతున్నాడు. ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకుని టిక్కెట్ల ధరలను విపరీతంగా పెంచేస్తున్నారు. దీనివల్ల సామాన్య, మధ్యతరగతి ప్రజలు సినిమా చూడాలంటేనే భయపడుతున్నారు. పోనీ పెంచిన ధరలకు అనుగుణంగా సినిమా థియేటర్‌లో సౌకర్యాలు బాగున్నాయనుకోవడం పొరపాటే. ఇక తినుబండారాలు, శీతల పానీయాలను ధరలను పెంచేస్తున్నారు. ప్రేక్షకులకు ఉచితంగా తాగునీరు, పరిశుభ్రమైన మరుగుదొడ్ల వసతి కల్పించాల్సిన బాధ్యత ఆయా థియేటర్ల యాజమాన్యాలపై ఉంది.

– ధర్నాలకోట వెంకటేశ్వరరావు, అడ్వకేట్, జనరల్ సెక్రటరీ, కన్స్యూమర్స్ రైట్స్ అవేర్నెస్ సెల్, రాజమహేంద్రవరం

తారెత్తిస్తున్న రేట్లు

రాజమహేంద్రవరం నగరం, రూరల్ ప్రాంతాల్లో సుమారు 16 థియేటర్లు ఉన్నాయి. సంక్రాంతి సందర్భంగా విడుదలైన సినిమాలకు ఒక్కో క్లాస్ టిక్కెట్ రూ.145 ధరకు అదనంగా రూ.100 కలిపి రూ.245కి విక్రయిస్తున్నారు. ఒక్కో నేల టిక్కెట్ రూ.75 ధరకు అదనంగా రూ.75 కలిపి రూ.150కి అమ్ముతున్నారు. కొన్ని థియేటర్ల నిర్వాహకులు ఆన్‌లైన్‌లో కొన్ని టికెట్లు మాత్రమే పెట్టి, కొన్ని ఆబ్లిగేషన్లకు ఇచ్చి, మిగిలినవి బ్లాక్ విక్రయదారులకు ఇచ్చేస్తున్నారు. దీని వల్ల క్లాస్ టిక్కెట్ రూ.500, నేల రూ.300కు విక్రయిస్తున్నారు. ఇక తినుబండారాలు ధరల విషయానికి వస్తే వాటర్ బాటిల్ రూ.30, పాప్‌కార్న్ రూ.60, పెద్దది రూ.150, స్వీట్‌కార్న్ రూ.50, పఫ్ రూ.30, సమోసా రూ.10, కూల్‌డ్రింక్ రూ.50 (టిన్, గ్లాస్), సీసా రూ.30కు విక్రయిస్తున్నారు. ఈ లెక్కన ఓ కుటుంబంలో నలుగురు సినిమాకు వెళ్లాలంటే రూ.1500 నుంచి రూ.1800 వరకూ ఖర్చవుతోంది.

వసతులు శూన్యం

సామాన్యుడు సినిమాకు వెళితే వాటర్ బాటిల్ కొనుక్కొనే పరిస్థితి ఉండదు. ప్రతి సినిమా థియేటర్‌లో తప్పనిసరిగా తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలి. అయితే ఏ థియేటర్‌లోనూ అది కనిపించదు. మరుగుదొడ్లు శుభ్రత గురించి చెప్పనవసరం లేదు. థియేటర్లను పర్యవేక్షించాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం వల్లనే ఈ పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ప్రేక్షకులు కోరుతున్నారు.

చిన్నారి వన్షికకు సత్కారం


వెలగదుర్రులో వన్షికను సత్కరిస్తున్న గ్రామస్తులు

ఉండ్రాజవరం: మండలంలో వెలగదుర్రులో శాస్త్రీయ సంగీత కళాకారిణి చిన్నారి మొకమాటి వన్షికను శనివారం పలువురు కళాకారులు, ప్రజాప్రతినిధులు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కెనడాలో స్థిరపడిన వన్షిక సంక్రాంతి పురస్కరించుకుని తన స్వగ్రామైన వెలగదుర్రుకు విచ్చేశారు. వన్షిక ఇటీవల స్వగ్రామం వెలగదుర్రుతో పాటు వైజాగ్, తణుకు తదితర చోట్ల తన శాస్త్రీయ సంగీత ప్రదర్శనలు చేసి అందరినీ ఆకట్టుకుంది. ఈ సత్కారంలో వన్షిక తల్లిదండ్రులు సత్యనారాయణ, విపంచి, సర్పంచ్ సాగి పద్మావతి, ముదునూరి రవీంద్ర రాజు, ప్రముఖ మృదంగ విద్వాంసుడు కాపా శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

విశేషాలంకరణలో వేంకటేశ్వరస్వామి


అన్నవరప్పాడులో వేంకటేశ్వరస్వామి

పెరవలి: అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి దర్శనానికి శనివారం వేలాది మంది భక్తులు పోటెత్తారు. స్వామి, అమ్మవార్లను వివిధ రకాల పూలతో అలంకరించడంతో భక్తులు స్వామిని చూసి తరించారు. తెల్లవారుజామున 4 గంటలకే మహిళా భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడం స్వామి వారి అభిషేకం కనులారా వీక్షించారు. స్వామికి అభిషేకం నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. 7 గంటల తరువాత ఆలయానికి వేల సంఖ్యలో భక్తులు రావటంతో దర్శనానికి సుమారు గంట సమయం పట్టింది. ఆలయానికి వచ్చిన భక్తులకు ఉదయం ఉచిత ప్రసాదాల పంపిణీతో పాటు 10 గంటల నుంచి అన్న సమారాధన నిర్వహించారు. ఈ అన్నదానాన్ని అన్నవరప్పాడు గ్రామానికి చెందిన సలాది బాలాజీ కుటుంబ సభ్యులు ఆర్థికసాయంతో నిర్వహించారు. కార్యక్రమంలో ఆరు వేల మంది భక్తులు స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారని ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు.

కుష్టు వ్యాధిని ముందుగా గుర్తించాలి


ఉండ్రాజవరం పీహెచ్‌సీలో కుష్టు వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఉండ్రాజవరం: కుష్టు వ్యాధిని ముందుగా గుర్తించడం వలన ఆరు నెలలు ఎండీటీ చికిత్స ద్వారా పూర్తిగా తగ్గించవచ్చని ఉండ్రాజవరం పీహెచ్‌సీ డాక్టర్ ప్రసాద్ అన్నారు. ఈనెల 20న నిర్వహించే జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా శనివారం ఉండ్రాజవరం పీహెచ్‌సీలో అవగాహన సదస్సు నిర్వహించారు. సీహెచ్‌వో సుబ్రమణ్యం మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు ఇంటిని విజిట్ చేసి వివరాలు సేకరించిన తరువాత ఇంటి గోడపై కనిపించే విధంగా టీం నంబర్ గృహంలో ఎంత మందిని పరీక్ష చేశారు అనేది చాక్‌పీస్‌తో వేయాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ ఉషాదేవి, ఆరోగ్య పర్యవేక్షకులు జి.శ్రీనివాస్, కె.సుభాషిణి, కేడీవీఎల్ కుమారి, ఆశా, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నిడదవోలు డివిజన్

90102 34548 (కొవ్వూరు)

90100 51493 (నిడదవోలు)

90100 68395 (గోపాలపురం)

Office mail : tpgadvt@gmail.com